ప్రజా సంక్షేమమే పరమావధి

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- ఒకటో డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది

గుణదల(విజయవాడతూర్పు): ప్రజా సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఒకటో డివిజన్ ఒకటో వార్డు సచివాలయం పరిధిలోని షిర్డీ సాయినగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా ప్రాంతంలో 212 గృహాలను కార్పొరేటర్ ఉద్దండి సునీతతో కలిసి ఎమ్మెల్యే విష్ణు సందర్శించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి, స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో పెరుగుతున్న గృహ సముదాయాలకు అనుగుణంగా కార్మెల్‌నగర్‌లో ఒక మోడల్ సబ్‌స్టేషన్ నిర్మించే దిశగా ఆలోచన చేస్తున్నట్లు ఎమ్మెల్యే విష్ణు చెప్పారు. గుణదల ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం టీచర్స్ కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను నిర్మిస్తామని వెల్లడించారు. ఎవరెన్ని అవాంతరాలు సృష్టించినా గుణదల ఆర్వోబీ పూర్తి చేయాలనే కృత నిశ్చయంతో పని చేస్తున్నామని తెలిపారు. ఏలూరు రోడ్డు నుంచి వచ్చే ఏ వాహనమైనా నేరుగా ఇన్నర్‌రింగ్ రోడ్డులో కలిసే విధంగా వంతెనల నిర్మాణాలు పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు.

సామాజిక న్యాయం సీఎం జగన్ నినాదం

సీఎం జగన్ నాయకత్వంలో సామాజిక సాధికారత రాష్ట్రమంతా ప్రతిధ్వనిస్తోందని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. ప్రజల ఆర్థిక, సామాజిక పరిస్థితులను మెరుగుపర్చేందుకు గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల పట్ల ప్రజలందరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలు సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో అన్నీ కుంభకోణాలే తప్ప ఏ ఒక్క వర్గానికీ మేలు జరగలేదని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత రూ 2.83 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో బటన్ నొక్కి జమ చేసినట్లు వివరించారు. తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు వివరించడమే బస్సు యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. సీఎం జగన్ నాయకత్వం ఈ రాష్ట్రానికి అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొండా మహేశ్వరరెడ్డి, ఆళ్ల ప్రసాద్‌రెడ్డి, ఉద్దండి సురేష్, బండి వేణు, మండాది వెంకట్రావు, తుంగం జాన్సీ, చంటి, నాగరాజు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో మరో ఈట్ స్ట్రీట్

- 31న వీఎంసీ కౌన్సిల్
- 127 అంశాలతో అజెండా
- విద్యాధరపురంలో రూ.1.78 కోట్లతో ఈట్‌స్ట్రీట్‌కు కౌన్సిల్ ప్రతిపాదన
- పర్యాటక ప్రాంతంగా గాంధీహిల్
- తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణకు 15వ ఆర్థిక సంఘం నిధుల ఖర్చుపై ప్రతిపాదన



మహాత్మాగాంధీ రోడ్డులోని ఈట్ స్ట్రీట్ (ఫైల్)

పటమట(విజయవాడతూర్పు): నగరంలో మరో ఈట్ స్ట్రీట్ ఏర్పాటుకు వీఎంసీ కౌన్సిల్ ప్రతిపాదన చేయనుంది నగరాభివృద్ధిపై ఈ నెల 31వ తేదీన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనుంది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో మొత్తం 127 అంశాలు ప్రతిపాదన వచ్చాయి.11 ప్రశ్నలతో సాగనున్న సమావేశంలో సభ్యులు వాటిపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

ముఖ్యాంశాలు

- నేషనల్ హెల్త్ మిషన్ అండ్ కమిషనర్ ఆఫ్ ఫుడ్ సేఫ్టీ, ఏపీ ప్రభుత్వం, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సర్కిల్ -1 పరిధిలోని విద్యాధరపురంలో ఈట్‌స్ట్రీట్‌ను నిర్మించనున్నారు. ఫుడ్‌స్టాల్స్, యుటిలిటీ ప్లేసెస్, పార్కింగ్ ఏరియా, టాయిలెట్లు, ఎలక్ట్రికల్ సౌకర్యాల సమకూర్చడానికి రూ.1.78 కోట్లు అంచనాలు రూపొందించారు. అందులో రూ. కోటి నిధులను నేషనల్ హెల్త్ మిషన్ సమకూర్చేందుకు అంగీకరించింది. మిగిలిన రూ.78 లక్షలను వీఎంసీ జనరల్ ఫండ్స్ నుంచి నిధులు వెచ్చించేందుకు వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు నిర్ణయం తీసుకోనున్నారు.
- నగరంలో పర్యాటక ప్రాంతంగా గాంధీ హిల్‌ను వీఎంసీ అభివృద్ధి చేసింది. ఇందులో తాగునీరు సరఫరా, నిఘా వ్యవస్థ ఏర్పాటు, రిసెప్షన్, హౌస్‌కీపింగ్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. గాంధీ హిల్‌పై ప్రవేశం, బ్యాటరీతో నడిచే వాహనాలను నాలుగు ఏర్పాటు చేయటం, చార్జింగ్ స్టేషన్, పార్కింగ్ జోన్‌తోపాటు ఖాదీ బజారు, రెస్టారెంట్, వినోదసవారీలు, టాయ్ ట్రయిన్, ఫుడ్, స్నాక్ బార్, ఫెర్రిస్‌వీల్ గొండ్‌విల్లా, సెల్ఫీపాయింట్, తదితరాల ఏర్పాటుకు పీపీపీ పద్ధతిలో నిర్వహణకు వచ్చిన ప్రతిపాదనపై కౌన్సిల్ సభ్యులు నిర్ణయం తీసుకోనున్నారు.
- వీఎంసీ ప్రాంగణంలో కొత్తగా నిర్మిస్తున్న కార్యాలయంలో రెండో అంతస్తును ప్రజారోగ్యం, ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు కేటాయింపు ప్రతిపాదనను అజెండాలో పొందుపరచారు.
- నగరపాలక సంస్థ మూడు సర్కిళ్లలోని 64 డివిజన్లలో తాగునీరు, మురుగునీటి నిర్వహణ, రిజర్వాయర్ల నిర్మాణం తదితర మౌలిక వసతుల కల్పనకు 15వ ఆర్థిక సంఘం నిధులు అమృత్ 2.0లో మంజూరైన రూ. 207 కోట్లు, వీఎంసీ సాధారణ నిధులు రూ. 20.7 కోట్లు ఖర్చు చేసేందుకు వచ్చిన ప్రతిపాదనపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.
- స్వరాజ్ మైదానంలో నిర్మాణంలో ఉన్న డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ స్మృతివనంలో మురుగువ్యర్థాల తరలింపునకు రూ. 1.4కోట్లు నిధులను కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నుంచి నిధులు వెచ్చించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు నిర్ణయం తీసుకోనున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



అంతరాలయంలో భక్తులు



దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శనివారం భక్తుల రద్దీ కొనసాగింది. తెల్లవారుజామున నుంచి రద్దీ ప్రారంభమైంది. సాయంత్రం వరకు భక్తులు కొండకు తరలివస్తూనే ఉన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఘాట్‌రోడ్డుపై నుంచి కొండపైకి చేరుకున్న భక్తులు అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మహా మండపం, మల్లేశ్వర స్వామి వార్ల ఆలయం మెట్ల మార్గం ద్వారా కొండ దిగువకు చేరుకున్నారు. మహా నివేదన నిమిత్తం అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. సర్వ దర్శనం, రూ. 100, రూ.300, రూ.500 టికెట్లు క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ నేపథ్యంలో ఆదివారం వరకు దసరా ఉత్సవాల ఏర్పాట్లను యథాతథంగా కొనసాగించాలని ఆలయ ఈవో కెఎస్. రామారావు ఆదేశాలు జారీ చేశారు. దీంతో శనివారం కూడా మహా మండపం ఎదుట షెడ్డులోనే భక్తులు, భవానీలకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. కనకదుర్గనగర్‌లో లడ్డూ ప్రసాదాలను విక్రయించారు. ఆదివారం కూడా ఇదే రీతిలో ఏర్పాట్లు కొనసాగుతాయని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

సందడిగా ‘శ్రీమతి అమరావతి’



గుణదల(విజయవాడ తూర్పు): శ్రీమతి అమరావతి ఎనిమిదో సీజన్‌కు సంబంధించిన ఆడిషన్స్ నగరంలోని నోవాటెల్ హోటల్‌లో జరిగాయి. 50 మంది గృహిణులు హాజరయ్యారు. వీరిలో 30 మందిని సీజన్ ఫైనల్స్‌కు పంపినట్లు నిర్వాహకులు తేజస్ ఎలైట్ ఈవెంట్స్ అధినేత ప్రదీప్‌చౌదరి తెలిపారు. నవంబర్ 11న ఫైనల్స్ జరుగుతాయని తెలిపారు.

ఆలయాలు మూసివేత



చంద్రగ్రహణం సందర్భంగా దాసాంజనేయుడి దేవాలయంను మూసివేస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): చంద్రగ్రహణం పురస్కరించుకుని సుప్రసిద్ధ మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయంను మూసివేశారు. ఆలయ సంప్రోక్షణ అనంతరం ఆదివారం ఉదయం తెరుస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు తెలిపారు. అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠం, ముత్యాలంపాడు శ్రీపార్వతి సమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయం, రామకృష్ణాపురం శ్రీ అలివేలుమంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామివారి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి శనివారం సాయంత్రం ఆలయాలను మూసివేశారు. సంప్రోక్షణ చేసిన తరువాత ఆదివారం ఉదయం ఆలయాలు తెరుస్తామని పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ తెలిపారు.

● ఏఆర్ గ్రౌండ్స్‌లో ఓపెన్ హౌస్





పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం నగరంలోని సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. దీన్ని పోలీస్ కమిషనర్ టీకే రాణా ప్రారంభించారు. ఓపెన్ హౌస్‌లో వివిధ ఆయుధాల పని తీరును విద్యార్థులకు వివరించారు. పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి అన్న ప్రసాదం భక్తులకు మరింత చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. దాతలు కోలపల్లి విశ్వక్‌సేన, యశస్వినిల సహకారంతో ఐదువందల మందికి అన్నప్రసాదాన్ని అందించారు. టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

ఎస్ఆర్ఆర్‌లో వ్యక్తిత్వ వికాసం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, ఎన్టీఆర్ జిల్లా యువజన సర్వీసుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం కెరీర్ గైడెన్స్‌పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన ప్రముఖ సైకాలజీ కౌన్సిలర్ సి.తేజోవతి, అసిస్టెంట్ మేనేజర్ స్టెప్ రాధిక ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వ్యక్తిత్వం అనేది ఒక వ్యక్తి వాస్తవ పరిస్థితుల పట్ల ప్రదర్శించే ప్రవర్తన ద్వారా వర్గీకరించబడుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ అవగాహన చాలా అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, కెరీర్ గైడెన్స్ ఇంచార్జ్ డాక్టర్ అజయ్‌బాబు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాగ్ విల్లీ ప్రారంభం



పటమట(విజయవాడతూర్పు): హైదరాబాదుకు చెందిన పెట్‌బోరింగ్ ఫెసిలిటీ డాగ్ విల్లీని పశ్చిమ, పెనమలూరు ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, కొలుసు పార్థసారథి ప్రారంభించారు. గురునానక్ కాలనీలో ఏర్పాటు చేసిన ఈ ఫెసిలిటీ ప్రారంభోత్సవంలో వీరు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఇంటిలోనూ పెంపుడు జంతువులు ఉంటున్నాయని, అత్యవసర పరిస్థితిలో వాటి పెంపకందారులు ఎక్కడికైనా వెళ్తే వాటి సంరక్షణను డాగ్‌వీల్లీ చూసుకుంటుందని తెలిపారు. డాగ్‌విల్లీ వ్యవస్థాపకురాలు అమృతవర్షిణి మాట్లాడుతూ తమవద్ద ఉంచిన పెంపుడు జంతువుల పరిమాణం ప్రకారం ప్రత్యేక గదుల్లో ఉంచుతామని, వాటి యజమానులకు సంరక్షణపై వీడియో కాల్‌ద్వారా అందిస్తామని తెలిపారు.

త్యాగరాజ కృతులకు నృత్యాభిషేకం



విజయవాడ కల్చరల్: శ్రీ రామచంద్రమూర్తి వైభవాన్ని తన కీర్తనల ద్వారా కీర్తించిన సద్గురు త్యాగరాజస్వామి కృతులకు నృత్యాభిషేకం జరిగింది. ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాపీఠం వేదికపై శనివారం అద్భుతమైన నృత్య సృష్టి జరిగింది. బెంగళూరుకు చెందిన నాట్యాచారిణి రక్షాకార్తీక్ బృందం త్యాగరాజ కృతి వైభవం అంశంగా నృత్యాలను ప్రదర్శించారు. నృత్య దర్శకత్వం రక్షాకార్తీక్, దివ్య, విజయలక్ష్మి ధర్మరాజన్, నిహారికా జయకుమార్, సహనా వెంకటసాయి, శాన్విలాల్ వాణి, స్మృతి శ్రీధర్ అంజలి సంజయ్ తదితరులు పాల్గొన్నారు. కళాశాల తెలుగు విభాగం అధ్యాపకుడు శివకుమార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, కళాపీఠం ప్రధాన కార్యదర్శి బీవీఎస్ ప్రకాష్, కళాపీఠం బాధ్యుడు పాలడుగు లక్ష్మణరావు, ఎస్.లలిత్ ప్రసాద్, పాల్గొన్నారు. కళాకారులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

ఎన్‌సీసీ ఇంటర్ గ్రూప్ పోటీలకు నలంద క్యాడెట్స్

లబ్బీపేట(విజయవాడతూర్పు): కాకినాడ గ్రూప్ నిర్వహించిన ఆర్డీసీ ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్‌లో తమ ఎన్‌సీసీ క్యాడెట్స్ ముగ్గురు కల్చరల్ విభాగంలో ఎంపికైనట్లు నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ క్యాడెట్స్ టి.వెంకట పవన్, బి.హిమబిందు, డి. సాయిశ్రీ ఈ నెల 27న ప్రారంభమైన మెహిదీపట్నంలోని మిలటరీ గారిసన్ శిక్షణ శిబిరంలో నవంబరు 5 వరకూ పాల్గొంటారని తెలిపారు. శిక్షణలో ప్రతిభ చూపి ఢిల్లీలో జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో తమ క్యాడెట్స్ పాల్గొనాలని కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ ఆకాంక్షించారు.

పర్యావరణ పరిరక్షణకు విద్యుత్ వాహనం

కొనుగోలు చేసిన కలెక్టర్ ఢిల్లీరావు



కలెక్టర్ ఢిల్లీరావుకు విద్యుత్ బైక్‌ను అందజేస్తున్న అవెరా సంస్థ ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పర్యావరణాన్ని పరిరక్షించేందుకు గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు వేయాలన్న ఆలోచనలను కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ఆచరణలో పెట్టారు. విద్యుత్ ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసి ఆ దిశగా అడుగులు వేశారు. వాహనంతో నగరంలో తిరిగి కాలుష్య నివారణకు తోడ్పాటు నందించాలని నిర్ణయం తీసుకున్నారు. అవేరా సంస్థకు చెందిన విద్యుత్ ద్విచక్ర వాహనాన్ని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కొనుగోలు చేశారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం వద్ద అవేరా సంస్థ ప్రతినిధులు కలెక్టర్ ఢిల్లీరావుకు బైక్ తాళాలు అందించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ విద్యుత్ వాహనాల వాడకంతో కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. తనవంతుగా కాలుష్య నివారణకు సాయంత్రం వేళల్లోనైనా విద్యుత్ బైక్ వినియోగించాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సులభ వాయిదాలపై వాహనాల కొనుగోలుకు బ్యాంకుల నుంచి రుణాలను మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అవేరా సంస్థ ఫౌండర్ అండ్ సీఈవో డాక్టర్ వెంకటరమణ, ఫ్యాక్టరీ అడిషనల్ మేనేజర్ ఎ. సత్య, ఏపీ మార్కెటింగ్ ఇన్‌చార్జ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ టీకే రాణా



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని, ప్రభాకరరెడ్డి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): మానవతా విలువలు, ఉన్నతమైన ఆదర్శాలను బోధించే రామాయణ మహా కావ్యాన్ని లిఖించి అందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహర్షి వాల్మీకి అని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా పేర్కొన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా శనివారం తన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాల్మీకి బోయవాడిగా పుట్టి, వేటగాడిగా జీవితాన్ని ప్రారంభించారన్నారు. మొట్టమొదటి ఇతిహాసమైన రామాయణాన్ని రచించి, ఆదికవిగా పరివర్తనం చెందిన మహర్షి వాల్మీకి అని చెప్పారు. ఆయన జీవిత చరిత్రను గుర్తు చేసుకుంటూ పట్టుదల, కఠోర దీక్షతో ఏదైనా సాధించగలమని తెలిపారు. కార్యక్రమంలో ఈస్ట్ డీసీపీ విశాల్ గున్ని, ఎస్‌బి అధికారులు, సీపీఓ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లబ్బీపేట(విజయవాడతూర్పు): వాల్మీకి మహర్షి రచించిన రామాయణం.. భావి తరాలకు జీవన విధానాన్ని తెలియజేసిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. నగరంలోని తన కార్యాలయంలో శనివారం వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు, ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ మాధవి, డాక్టర్ పద్మావతి, డీపీఎం డాక్టర్ నవీన్, గణాంక అధికారి ఎస్.లక్ష్మోజీ, డీపీఓ మహేష్, డిప్యూటీ డెమో ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాన చరితుడు ఘంటసాల



ఘంటసాల అభిమానుల సమావేశంలో మాట్లాడుతున్న దేవిడ్‌రాజు తదితరులు

విజయవాడ కల్చరల్: గాన చరితుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని విశ్రాంత పోలీసు అధికారి కె.డేవిడ్ రాజు అన్నారు. రమణ కల్చరల్ ఆర్ట్స్, గణేష్ సేవా సమితి, కామ్రేడ్ జీఆర్ పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఘంటసాల అభిమానుల ఆత్మీయ సమావేశం, ఘంటసాల సినీ సంగీత విభావరి కార్యక్రమం గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళా వేదికలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారి గాన చిత్రను చాటి చెప్పిన మహనీయుడు ఘంటసాల మాస్టారు అని అభివర్ణించారు. రమణ కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు మాంతి రమణ మాట్లాడుతూ ఘంటసాలను నేటి గాయనీ గాయకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పి.శివలీల, రమణపాత్రో, రత్నకుమారి, రూపశ్రీ ఘంటసాల గీతాలను మధురంగా ఆలపించారు. కార్యక్రమంలో రమణ కల్చరల్ ఆర్ట్స్ ఉపాధ్యక్షుడు ప్రభల శ్రీనివాస్, వివిధ సంస్థల ప్రతినిధులు బీవీ వీరభద్రరావు, కొప్పుల ఆనంద్, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

మేరీ మట్టి-మేరీ దేశ్ కలశంతో ఢిల్లీ పయనం

విజయవాడరూరల్: మేరీ మట్టి-మేరీ దేశ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు విజయవాడ రూరల్ మండలం నుంచి కలశంతో మండల పరిషత్ సిబ్బంది శనివారం దేశ రాజధానికి పయనమై వెళ్లారు. విజయవాడ రూరల్ మండలంలోని 14 గ్రామాల నుంచి సేకరించిన మట్టిని కలశం చేసి ఆ కలశంతో మండల కార్యాలయం నుంచి సిబ్బంది విజయబాబు, నారాయణరావు ఢిల్లీ తీసుకువెళ్లారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఢిల్లీలో ఇండియా గేటు వద్ద అమరులైన సైనికుల జ్ఞాపకార్థం నిర్మించే స్థూపం కోసం ఈ కలశాలను వినియోగించనున్నట్టు ఎంపీడీఓ బి.భార్గవి తెలియజేశారు.

చెట్టుపై నుంచి పడి యువకుడికి గాయాలు



నవదీప్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న తోటి కార్మికులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో దసరాకు ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లను తొలగించే క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు పైకి ఎక్కిన యువకుడు ప్రమాదవశాత్తూ పై నుంచి కింద పడటంతో తలకు గాయాలయ్యాయి. శ్రీకాళహస్తికి చెందిన నవదీప్ అనే యువకుడు దసరా ఉత్సవాలకు లైటింగ్ ఏర్పాటు చేసే కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. ఆలయ ప్రాంగణంలోని చెట్టుపై ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లను తొలగించేందుకు చెట్టుపైకి ఎక్కాడు. ఉదయం 11 గంటల సమయంలో చెట్టు కొమ్మపై ఉన్న సీరియల్ లైట్ల దండను తొలగించే క్రమంలో పట్టుతప్పి కింద పడ్డాడు. నవదీప్ తలకు , కంటికి గాయాలు కావడంతో పాటు పళ్లు కూడా విరిగి పడ్డాయి. దీంతో వెంటనే ఆలయ ప్రాంగణంలోని సిబ్బంది, పోలీసులు, ఇతర కాంట్రాక్టు సిబ్బంది నవదీప్‌ను రాజగోపురం ఎదుట ఉన్న ప్రాథమిక వైద్య కేంద్రానికి తరలించారు. అయితే అక్కడి సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి వెంటనే నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నవదీప్‌కు తలకు గాయాలయ్యాయని, ప్రమాదం ఏం లేదని వైద్యులు చెప్పారని తోటి కార్మికులు పేర్కొన్నారు.

స్థలము కావలెను
విజయవాడ నగరములో మెయిన్ రోడ్డుకు దగ్గరలో సుమారు 1000 గజముల కమర్షియల్ స్థలము అమ్మకమునకు గాని దీర్ఘకాలిక లీజుకు గాని స్థలము కావలెను.
సెల్: 9121374556

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ సెంట్రల్ :
9010201611
Office mail : sakshiads@gmail.com